క్లుప్తంగా

వర్షం కోసం ప్రార్థన



కొండపై ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలోని క్రైస్తవులు ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో శనివారం కొండపై ప్రార్థనలు చేశారు. పంటలు ఎండుతున్నందున వర్షం సమృద్ధిగా కురిసి అన్నదాతలను ఆదుకోవాలని ఏసుప్రభువును వేడుకున్నామని పాస్టర్లు జాన్ విక్టరీ, రాజకుమార్ తెలిపారు.

రంగనాథుడికి శ్రావణమాస పూజలు



పల్లకీలో ఆలయ ప్రదక్షిణ

మద్దికెర : మండల పరిధిలోని పెరవలిలో ప్రసిద్ధ రంగనాథస్వామి వారికి శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందె సేవతో పాటు అష్టోత్తరనామార్చన, అభిషేకం, ఆలయ ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దికెర : సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శనివారం షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడై స్వామివారు కొలువు తీరగా అర్చకు లు హోమాలు నిర్వహించారు. భక్తులకు స్థానికులు కుండా సూర్యనారాయణ అన్నదానం చేశారు.

పండ్లు, బ్రెడ్డు పంపిణీ



వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు అందజేస్తున్న నాయకులు

కల్లూరు: యూటీఎఫ్ (యూనైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) 50 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో శనివారం నాయకులు కర్నూలు నగరంలోని మన వృద్ధుల ఆశ్రమంలో పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి యూటీఎఫ్ చేసిన సేవలను ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా వైస్ ప్రసిడెంట్ హేమంత్ కుమార్ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఫీక్, రామకృష్ణ, అనిల్ కుమార్, వెంకటేష్, చంద్రకళ, విజయలక్ష్మి, సురేష్, ప్రదీప్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



కొత్తపేట శివారు కొండలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: ఆలూరు సెబ్ పరిధిలోని హొళగుంద మండలం కొత్తపేట శివారు కొండల్లో శనివారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించినట్లు సెబ్ సీఐ మల్లిక తెలిపారు. నాటుసారా తయారీ బట్టీని పగలకొట్టి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అలాగే ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నాగన్న అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 21 కర్ణాటక 90 ఎంఎల్ టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐ వీరస్వామి, సిబ్బంది రామలింగమ్మ ఉన్నారు.

వాతావరణ మార్పులు పంటలపై ప్రభావం

కృష్ణగిరి: వాతావరణంలో వస్తున్న మార్పులు పంటలపై ప్రభావం చూపుతాయని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చేస్తున్న పంట నమోదును శనివారం ఆయన పరిశీలించారు. సాగు చేసిన పంటలనే నమోదు చేయించుకోవాలన్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల మూలంగా పంటలకు తెగుళ్లు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. విచక్షణా రహితంగా రసాయన మందులు వాడడం వలను వాతావరణ, భూ కాలుష్యం ఏర్పడుతాయనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలని సూచించారు.

అధికార దౌర్జన్యం.. రైతన్నకు నష్టం

- టీడీపీ నాయకుల నిర్వాకంతో నిలిచిపోయిన కూరగాయల వేలాలు
- వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేసిన వైనం
- ఐదు రోజులుగా బిల్లేకల్లు మార్కెట్ బంద్
- అవస్థలు పడుతున్న అన్నదాతలు



బిల్లేకల్లు మార్కెట్లో టమాటలను అమ్మకానికి తెచ్చిన రైతులు (ఫైల్)



ప్రస్తుతం వెలవెలబోతున్న కూరగాయల మార్కెట్

ఆస్పరి: అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యం వల్ల మండలంలోని బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్ బంద్ అయ్యింది. ఈనెల 5వ తేదీన కూరగాయల వేలాల్లో వ్యత్యాసాలు ఉన్నాయనే సాకుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రాళ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనలో ఆస్పరి సీఐ హనుమంతప్పకు తలకు గాయం కాగా, 10 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతల దృష్ట్యా గ్రామంలో ఈనెల 5వ తేదీ నుంచి పోలీసులు మార్కెట్‌ను బంద్ చేయించారు. దీంతో రైతులు పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి నానా అవస్థలు పడాల్సిన వస్తోంది.

రోజుకు 5 లారీల కూరగాయల ఎగుమతి

బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్‌కు చుట్టుపక్కల గ్రామలైన బిల్లేకల్లుతో పాటు ముత్తుకూరు, వలగొండ, పుటకలమర్రి, జూటూరు, అలారుదిన్నె, అటికెలగుండు, పుప్పాలదొడ్డి, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు, నలకదొడ్డి, తెర్నేకల్లు, బైలుప్పల గ్రామాల నుంచి ప్రతి రోజు చిక్కుడు కాయలు, మిర్చి, టమాట, వంకాయలు, చౌళకాయాలు, బీరకాయాలు, కాకరకాయలు, బెండకాయలు తదతర కూరగాయలు 2వేల ప్యాకెట్లకు (ఒక ప్యాకెట్ 15కేజీలు)పైగా వచ్చేవి. ఇక్కడి నుంచి సుమారు 5 లారీలు కూరగాయలను హైదరాబాదు, విజయవాడ, గుంటూరు తదితర పట్టణాలకు వ్యాపారులు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం మార్కెట్ బంద్ కావడంతో ఆ గ్రామాల రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు పత్తికొండ మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు.

రైతన్నకు పెరిగిన ఖర్చు

బిల్లేకల్లు మార్కెట్లో అయితే కాంట్రాక్టర్ రూ.100కు 8 పైసలు మాత్రమే కమీషన్ తీసుకునే వారు. మార్కెట్లోకి ఎద్దుల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకొచ్చిన సరుకును రైతులే దించుకునే వారు. అదే పత్తికొండ మార్కెట్లో అయితే రవాణ ఖర్చు ప్యాకెట్‌కు రూ.20, మార్కెట్లో వంద రూపాయలకు 10 పైసలు కమీషన్‌తో పాటు, కూరగాయలు సంచులను దించేందుకు హమాలీకి ప్యాకెట్‌కు రెండు రూపాయల చొప్పున చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. దీంతో బిల్లేకల్లు మార్కెట్ కంటే పత్తికొండ మార్కెట్లో రైతులు సరుకు అమ్ముకోవాలంటే 15 కేజీల ప్యాకెట్‌కు అదనంగా రూ. 24 రూపాయలు ఖర్చు వస్తుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరకు ఒక ప్యాకెట్ మిర్చి రూ. 500 ధర పలికిందంటే కమీషన్ రూ.10, రావాణకు రూ. 20, హమాలీ ఖర్చు రూ.2 వస్తుందని పేర్కొంటున్నారు. బిల్లేకల్లు మార్కెట్లో సరుకు అమ్ముకుని త్వరగా గ్రామాలకు వెళ్లే వారమని ప్రస్తుతం ఇంటికి వెళ్లే సరికి రాత్రి అవుతోందని రైతులు వాపోతున్నారు. బిల్లేకల్లు దినసరి కూరగాయల మార్కెట్ యథాతథంగా నడిపించాలని పోలీసు అధికారులను కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మార్కెట్ అభివృద్ధి

వైఎస్సార్‌సీ ప్రభుత్వంలో బిల్లేకల్లు మార్కెట్ మార్కెట్లో సుమారు రూ. 2.50కోట్లులో అభివృద్ధి పనులు జరిగాయి. మార్కెట్‌కు కాంపౌండ్ వాల్, సీసీరోడ్లు, రైతుల కోసం షెడ్లు నిర్మించారు. ఏటేటా మార్కెట్ మార్కెట్‌కు ఆదాయం పెరుగుతూ వస్తోంది. మార్కెట్ 2020–21లో రూ.26.64లక్షలు ఆదాయం రాగా..2021–22లో రూ.35.70లక్షలు, 2022–23లో రూ.54.38లక్షలు, 2023–24లో 58.50 లక్షలు ఆదాయం వచ్చింది.

అమ్ముకోవాలంటే తిప్పలు



బిల్లేకల్లు దినసరి కూరగాయలు మార్కెట్ బంద్ అయినందున చాలా ఇబ్బందులు పడుతున్నాం. నేను బోరు కింద రెండు ఎకరాల్లో వంకాయ, మిర్చి పంట వేశా. కోత కోసినప్పుడల్లా 50 ప్యాకెట్లు వంకాయలు, 100 ప్యాకెట్లు మిర్చి వస్తుంది. ఇక్కడ నుంచి ఆటోకు పత్తికొండ తీసుకెళ్లాలంటే ఒక ప్యాకెట్‌కు రూ. 20 రుపాయలు, కమీషన్ వందకు రూ.10, హమాలీ ఖర్చు రెండు రూపాయలు వస్తుంది. పైగా మార్కెట్‌కు త్వరగా వెళ్లాల్సి వస్తుంది. బిల్లేకల్లు మార్కెట్లో అయితే ఇవన్ని ఖర్చులు మిగిలేవి. కమీషన్ మాత్రమే ఇవ్వాల్సి వచ్చేది.– **మహీంద్ర, రైతు, పుటకలమర్రి, ఆస్పరి మండలం**

బిల్లేకల్లు మార్కెట్ తెరిపించాలి



బిల్లేకల్లు మార్కెట్లో కూరగాయల అమ్మకాలను నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నేను వర్షాధారం కింద చౌళకాయలు వేశాను. బిల్లేకల్లు అయితే మా గ్రామానికి 4కిలో మీటర్లు, త్వరగా అమ్ముకొని గ్రామం చేరుకునేవాళ్లం. పత్తికొండ అయితే అమ్ముకొని రావాలంటే రాత్రి అవుతుంది.

– **వెంకట్రాముడు, రైతు పుటకలమర్రి**

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



బిల్లేకల్లు మార్కెట్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మార్కెట్‌కు దాదాపు 10 గ్రామాల రైతులు కూరగాయలు తెచ్చి అమ్ముకునే వారు. మార్కెట్ బంద్ అయి ఐదు రోజులు కావడంతో రైతులు పత్తికొండ మార్కెట్లో అమ్మకాని వెళ్తున్నారు. దీంతో అదనంగా ఖర్చు వస్తుంది. దీనికితోడు ప్రయాస పడాల్సి వస్తోంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ నడిచేలా చూడాలి.

– **విరూపాక్షి, సీపీఐ మండల కార్యదర్శి ఆస్పరి**

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

హాలహర్వి: ప్రతి రైతు ఈ క్రాప్ (పంటల) నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటల వివరాలను దగ్గరలోని రైతు సేవా కేంద్రాల్లో తెలియజేయాలన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పొలాల వద్దకు వచ్చి జీయో ట్యాగింగ్ చేస్తారన్నారు. పంటల నమోదు వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. అలాగే పంట నష్టం జరిగిన సమయంలో పంట నష్టపరిహారం అందుతుందన్నారు.

స్ప్రింక్లర్ల కోసం నమోదు చేసుకోండి

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే బిందు సేద్య పరికరాల కోసం ఆసక్తి రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని ఏపీఓ నర్సిరెడ్డి శనివారం తెలిపారు. ఐదు ఎకరాలలోపు సన్న కారు రైతులకు ప్రభుత్వం స్ప్రింక్లర్లు అందిస్తుందన్నారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, 1బీ, చెక్ బందీ, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, విద్యుత్ బిల్లులతో రైతు సేవా కేంద్రాలలో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

13న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 13న సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శేషిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 17వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి మండలంలో గత నెల 29 నుంచి ఈ నెల 12వరకు తనిఖీ సిబ్బంది గ్రామాల్లో పనులను పరిశీలించి గ్రామసభలు నిర్వహించారన్నారు. ఈమేరకు మంగళవారం నిర్వహించే బహిరంగ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- కూటమి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు
- ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కార్యకర్తల బలగమే వైఎస్సార్‌సీపీకి బలమని ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. శనివారం దేవనకొండలోని ఓ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావొస్తున్నా కేవలం పింఛన్ మాత్రమే పంపిణీ చేస్తోందని, మిగతా సూపర్ సిక్స్ పథకాల్లో దేనినీ పట్టించుకోవడం లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఎక్కడ అడుగుతారోనని ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్తకు భరోసా ఇవ్వడానికి నేనునాన్ని చెప్పడానికి ఆలూరు నియోజకవర్గంలోని ప్రతి మండలం, కార్యకర్తలను కలిసి భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. టీడీపీ సాగిస్తున్న అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం వారే చెబుతారన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను నేడు ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీను, జెడ్పీటీసీ రామకృష్ణ, తెర్నెకల్ సర్పంచ్ అరుణ్కుమార్, నాయకులు, కార్యకర్తలు పల్లెదొడ్డి చంద్రన్న, తపాల రామాంజనేయులు, బంగారు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మల్లయ్య (ఫైల్)



మల్లయ్య మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి

ఆస్పరి: ఆస్పరి మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో శనివారం ఉప సర్పంచ్ రైతు మల్లయ్య (49) విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. బిల్లేకల్లు గ్రామ సమీపంలోని తన పొలంలో మల్లయ్య పత్తి పొలంలో గుంటక పాస్తుండగా పొలంలోనే ఉన్న మెయిన్ లైన్ విద్యుత్ స్తంభానికి ఉన్న అర్త్ వైర్‌కు తగిలాడు. ఆ సమయంలో వైర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు అనిల్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయనకు భార్య జయమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటన జరిగిన వెంటనే ఆస్పరి ట్రాన్స్‌కో ఏఈ ఉలిగప్ప, లైన్ ఇన్‌స్పెక్టర్ రాముడు, లైన్ మెన్ రామకృష్ణ వెళ్లి పరిశీలించారు.

ఆలూరు ఎమ్మెల్యే పరామర్శ

దేవనకొండ మండలం పర్యటనకు వెళ్లిన ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి ఘటన స్థలానికి చేరుకుని మల్లయ్య మృతి దేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు మల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మహాశిల్పంపై దాడులు దారుణం

ఆలూరు: విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా శిల్పంపై కూటమి నేతలు భౌతికంగా దాడులకు యత్నించడం, శిలాఫలకాలను ధ్వంసం చేయడం దారుణమని ఆలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. అనంతరం మండల కన్వీనర్ ఈరన్న, కో-కన్వీనర్ వీరేష్, మాజీ ఎంపీటీసీలు నాగేంద్ర, కిశోర్ తదితరులు మాట్లాడారు. కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ నేతల విగ్రహాలపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత

ఆదోని అర్బన్: డివిజన్ పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో శనివారం పాముకాటు గురైన ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. హొళగుంద మండలం నెరణికితండా గ్రామానికి చెందిన బాలుడు మునిస్వామి ఇంట్లో ఆడుకుంటుండగా పాముకాటు వేసింది. అదేవిధంగా కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురై అస్వస్థతకు గురైంది. వెంటనే వారి బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కౌలుట్ల చెన్నకేశవస్వామికి శ్రావణ పూజలు



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీ లక్ష్మీ కౌలుట్ల చెన్నకేశవస్వామి దేవస్థానం హరినాయణ, కౌలుట్ల రంగనామంతో మార్మోగింది. అశేష భక్త జనకోటి సమూహం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత శ్రావణమాసం మొదటి శనివారం ఇంత పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం ఇదే మొదటిసారి. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవిసమేత కౌలుట్ల స్వామివారిని ఆలయం చుట్టూ పల్లకీసేవ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆర్.వెంకటేశ్వరరెడ్డి, దేవాలయ సిబ్బంది శ్రీను, సురేష్, రాజు, పండితులు వేణుగోపాల్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

అగ్రహార ఆంజనేయుడికి శ్రావణమాస పూజలు

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద శివారులోని తెల్లకొండ వద్ద వెలిసిన అగ్రహార ఆంజనేయస్వామికి శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు కాలి నడకన తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భజన, ఆలయ ప్రదక్షిణ, అభిషేకాలు, పవమాన హోమం, మహామంగళ హారతి, అలంకారం, ఆకుల అర్చన తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా భక్తులకు తీర్థ ప్రసాదాలతో అన్నాదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే నాగరకణ్వీ, లింగంపల్లి తదితర గ్రామాల్లోనూ శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



తంగడరోణలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఆస్పరి: మండలంలోని తంగడరోణ, మజరా గ్రామమైన తురువగల్లులో శనివారం పారిశుద్ధ్యపు పనులు చేయించారు. సర్పంచ్ శంకరమ్మ మాట్లాడుతూ.. రెండు గ్రామాలలో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయిచడం, వాటర్ ట్యాంకులు క్లినింగ్ చేయించడం జరిగిందన్నారు. వీధులలో బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు మందు స్ప్రే చేయించడమే కాకుండా ప్రతి వీధిలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మృతి చెందిన హనుమంతరెడ్డి(ఫైల్)

తుగ్గలి : గుండె పోటుతో మామిళ్లకుంట వైఎస్సార్ సీపీ నాయకుడు బొల్ల హనుమంతరెడ్డి(58) మృతి చెందారు. శనివారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు పత్తికొండకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. హనుమంతరెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఆదివారం అంత్య క్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైకుల దొంగ అరెస్ట్



పట్టుబడిన దొంగ, స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న ఎస్ఐ నరేంద్ర

హాలహర్వి: ఆదోని, బళ్లారి పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్న రాజు అనే దొంగను పట్టుకున్నట్లు హాలహర్వి ఎస్ఐ నరేంద్ర తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో దొంగను, దొంగలించిన బైకులను విలేకరులకు చూపుతూ వివరాలను వెల్లడించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మొత్తం 13 మోటార్ సైకిళ్లను దొంగ నుంచి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కొన్ని రోజులుగా రాజు పోలీసుల కళ్లు కప్పి తప్పించుకుని తిరుగుతున్నాడని చెప్పారు. కేసును సీరియస్‌గా తీసుకున్న తాము పక్కా సమచారం మేరకు హాలహర్వి గ్రామశివారులోని పెట్రోల్ పంపు వద్ద రాజు తచ్చాడుతుండగా తన సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నామని చెప్పారు. సదరు వ్యక్తిపై క్రైమ్ నంబర్ 63/2024 యూ/ఎస్ 303(2) ఆర్/డబ్ల్యూ 3(5) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసును ఛేదించడంతో ఉన్నతాధికారులు హాలహర్వి పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అయ్యన్నస్వామి, రంగనాయక్, వీరారెడ్డి, రాజశేఖర్, పాండు ఉన్నారు.

'హలో మాదిగ చలో'ను విజయవంతం చేద్దాం

హొళగుంద: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి శుక్రవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినేట్ మీటింగ్‌ను విజయవంతం చేసుకుని తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి ఈ నెల 10 ఏర్పాటు చేసిన 'హలో మాదిగ చలో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు హెబ్బటం పక్కీరప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం నాయకులు రాము మాదిగ, పెద్ద ఉలిగప్ప, అంజి, శేషగిరి, రమేష్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల కాలం నాటి మాదిగల చిరకాలస్వప్నాన్ని సాధించుకొచ్చిన దళిత ముద్దు బిడ్డకు ప్రతి పల్లె నుంచి తరలి వెళ్లి ఘనస్వాగతం పలుకుదామన్నారు.

హామీలను అమలు చేయాలి



ఆస్పరిలో మాట్లాడుతున్న జిల్లా సీపీఐ కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆస్పరిలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల సమితి సమావేశం నిర్వహించారు. గిడ్డయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన విధంగా మహిళలకు సంవత్సరానికి రూ.18వేలు, అమ్మకు వందనం రూ.15వేలు, రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతం గురించి చెప్పుతూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీలను తొలగించి తమ వారిని నియమించాలని కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ నాయకులు విరూపాక్షి, బ్రహ్మయ్య, క్రిష్ణమూర్తి, ఉరుకుందప్ప, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ఆర్డీఓ సమీక్ష

తుగ్గలి(పత్తికొండ) : తాగునీటి సరఫరాపై స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో రామలక్ష్మి రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష చేశారు. తాగునీటి సరఫరాలో సమస్యలు, జలజీవన్ నిధులతో చేపట్టిన పనులు, చేట్టాల్సిన పనుల ప్రతిపాదనలపై సమీక్షించారు. ఆర్డీవో మాట్లాడుతూ తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, వాటర్ ట్యాంక్‌లు తరచూ క్లోరినేషన్ చేయించాలని సూచించారు. అలాగే తండాలు, గ్రామాల్లో ప్రజలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గురువారం మహిళా పోలీసులతో పాఠశాలలు, వసతి గృహాలు, తనిఖీ చేయించాలన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

తుగ్గలి : మండల పరిధిలోని జాప్లాతండ పరిసర ప్రాంతాల్లోని నాటుసారా స్థావరాలపై సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. 10లీటర్ల సారా సీజ్ చేయడంతో పాటు 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఒకరి అదుపులోకి తీసుకుని, 160 కిలోల సారా తయారీకి వినియోగించే బెల్లం స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సెబ్ సీపీ సువర్ణలత, ఎస్ఐ కార్తీక్‌సాగర్, సిబ్బంది సర్దార్‌హుసేన్, మాబుపీరా, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



పత్తికొండలో జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తుగ్గలి(పత్తికొండ) : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఏర్పడి 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పత్తికొండ పట్టణంలోని కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను సంఘం సీనియర్ నాయకులు నర్సోజీ ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయ జీవితాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్ బాబు, నాగభూషణం, ఈశ్వర్, వీరేష్, రంజాన్‌షరీఫ్, రంగస్వామి, సత్యనారాయణ, అబ్దుల్, సుధ, వెంకటేశ్వరరెడ్డి, నాగేష్, రవీంద్ర, ఇబ్రహీం, ఖలీల్ పాల్గొన్నారు.